'రిజర్వేషన్ల రద్దుపై రాహుల్ గాంధీ అబద్ధపు ప్రచారం'

వేములవాడ, సెప్టెంబర్ 25 : ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆరోపించారు. వేములవాడలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్‌తో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మనదేశంలో ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లపై రాహుల్ గాంధీ అమెరికాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వాస్తవ విరుద్ధంగా మాట్లాడిన రాహుల్ గాంధీ వెంటనే ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చందుర్తి మండలాధ్యక్షుడు రాకేశ్, గంగరాజు తదితరులున్నారు.

పాఠశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 25 : పొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్‌సార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు బుధవారం హరితహారంలో భాగంగా పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు మొక్కలు నాటించి వాటిని పెంచాలని సూచిస్తూ వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శిరీష, కీర్తన, శ్రీలక్ష్మి, అస్మ ఉన్నారు.

మైనార్టీ విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీలకు ఇంటర్వ్యూలు

కలెక్టరేట్, సెప్టెంబర్ 25 : మైనార్టీ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. సదరు ఫ్యాకల్టీ పోస్టులకు ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధవారం కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ 8 పోస్టులకు 1ః6 చొప్పున ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆయా మైనార్టీ విద్యా సంస్థల్లో జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఒక్కో పోస్టుకు మెరిట్ ప్రకారం ఆరుగురు అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన ఆర్ఎల్‌సీ రాజేందర్, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి మైనార్టీ ఆఫీసర్ రాధాభాయ్, ఓఎస్‌డీ సర్వర్‌మియా, ప్రిన్సిపాళ్లు లక్ష్మీనారాయణ, ఫాతిమా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 25: మండల పరిషత్ కార్యాలయంలో వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మంచి నీటి సహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని ఈఈ జానకి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లంబింగ్, పైప్‌లైన్ రిపేర్, నల్లాల బిగింపుపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఎంపీవో జోగం రాజు, ఏఈ సంతోష్, అనిల్, అభిషేక్ ఉన్నారు.

ముస్తాబాద్, సెప్టెంబర్ 25 : మండలంలోని గ్రామాల్లో ప్రజలకు మంచినీటి సహాయకులకు మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం శిక్షణలో ట్రైనర్ లచ్చిరెడ్డి మోటర్ రిపేర్, బోర్డులకు విద్యుత్ కనెక్షన్‌పై శిక్షణ ఇచ్చారు. ఇక్కడ మండల ప్రత్యేకాధికారి లత, మిషన్ భగీరథ డీఈ రాం, ఏఈ హరిప్రియ, ఎంపీవో బీరప్ప, రెండు మండలాల మంచినీటి సహాయకులున్నారు.

108లో మహిళ ప్రసవం

వీర్నపల్లి, సెప్టెంబర్25: మండలంలోని బంజేరుకు చెందిన గర్భిణి భూక్యా శిల్ప పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 సమాచారం అందించారు. ఈఎన్‌టీ నునావత్ మదన్, పైలెట్ రాజశేఖర్ మహిళను 108లో సిరిసిల్ల ప్రధాన దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో కుటుంబ సభ్యుల సాయంతో గర్భిణికి సిబ్బంది అంబులెన్స్‌లోనే పురుడుపోశారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 25 : మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన పోతరాజు అనిత కు బుధవారం పురిటి నొప్పులు రాగా 108లో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించిందని సిబ్బంది తెలిపారు. గర్భిణికి నొప్పులు ఎక్కువ కావడంతో ఆశ కార్యకర్త సహకారంతో టెక్నీషియన్ శ్రీకాంత్ పాయిలోట్ మనోజ్ సహకారంతో పురుడు పోశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వారిని సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించామన్నారు. సకాలంలో పురుడు పోసిన వారిని డాక్టర్ అభినందించారు.

స్వచ్ఛత స్పోర్ట్స్ లీగ్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 25: సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్దబోనాల రోడ్డులో స్వచ్ఛత స్పోర్ట్స్ లీగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ టీం, మున్సిపల్ కమిషనర్ టీం జట్లు పోటీపడగా కమిషనర్ టీం ఆరు వికెట్ల తేడాతో గెలుపొందినట్లు కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్స్ లీగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు.

తహసీల్దార్‌కు వినతి

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 25: వీఆర్ఏ వారసులకు నియామక ఉత్తర్వులు అందజేయాలని కోరుతూ వేములవాడ రూరల్ తహసీల్దార్‌కు వీఆర్ఏల వారసులు వినతి పత్రం అందజేశారు. గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యూలరైజ్ చేస్తూ కారుణ్య నియామకాల కోసం జీవో నెంబర్ 81, 85 ప్రకారం 3,7 97 మంది 61 సంవత్సరాలు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియామకం జీవోలు జారీ చేసిందని, వాటిని అమలు చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, సెప్టెంబర్ 25 : మండలంలోని మానేర్ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. మండలంలోని ఆవునూర్ మానేర్ వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లతోపాటు ఆవునూర్‌కు చెందిన బత్తుల గణేశ్, కోల నితిన్, బిన్ని బానుచందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు

వరిలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, సెప్టెంబర్ 25 : వరి పైరుకు ప్రస్తుత వాతావరణం అగ్గి తెగులు, ఎండు తెలుగు సోకుతుందని రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి సురేశ్ రెడ్డి సూచించారు. మండలంలోని బుధవారం పొత్తూరులో రైతులతో కలిసి వరిని పరిశీలించారు. ఇక్కడ ఏఈవో లలిత, రైతులు రాజేశం, నారాయణరెడ్డి తదితరులున్నారు.

విహారయాత్రకు తరలిన విద్యార్థులు

వీర్నపల్లి, సెప్టెంబర్ 25: మండలంలోని గర్జనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం విజ్ఞాన విహారయాత్రకు తరలివెళ్లారు. చారిత్రక ప్రదేశామైన రంగంపేట బుగ్గరామన్న ఆలయాన్ని సందర్శించారు. ఇక్కడ హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులున్నారు.

అక్టోబర్ 9న రాజన్న ఆలయంలో వేలం పాటలు

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 25 : అక్టోబర్ 9న రాజన్న ఆలయంలో వివిధ అంశాలకు సంబంధించి ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై ఉదయం11 గంటలకు వేలం పాటలు నిర్వహిస్తామని ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ వేలం పాటలలో భక్తులకు ఆలయ ప్రాంగణంలో వెజిటేరియన్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహణ, బెల్లం, పూజా సామగ్రి విక్రయానికి, స్వామివారి ఆలయం నందు కొబ్బరిముక్కలు పోగుచేసుకోవడం కోసం, కోడె మొక్కుబడి భక్తులకు పచ్చగడ్డి, అరటి పండ్లు, పత్రి, విడిపూలు అమ్ముకోవడం కోసం తదితర అంశాలపై వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 25: ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి స్థానాచార్యులు నమిలకొండ ఉమేశ్, దుమాల నాగరాజు, దేవరాజు భాస్కర్, గోపన్నగారి శివప్రసాద్, గణేశ్, అప్పాల రాజా చంద్ర, బుడెంగారి రాజు, విశ్రాంత అర్చకులు నందగిరి భాను తదితరులున్నారు.

దేవాలయాల్లో రాజకీయ బదిలీలు!

- రాజన్న ఆలయ ఉద్యోగికి యాదగిరిగుట్ట డిప్యూటేషన్
- తగ్గుతున్న పర్యవేక్షకుల సంఖ్య
- విప్ మౌనం వీడాలని కోరుతున్న భక్తులు

Office of the Commissioner
Endowments Department, Telangana, Hyderabad
L.Dis. No.B1/140/2023, Dt:23.09.2024

Sub: Endowments Department - Sri V.Srilatha, Superintendent Sri Raja Rajeshwara Swamy Devasthanam, Vemulawada and Sri Srilatha District - Request for deputation to Sri Laxmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District - Orders issued.

Ref: Rc.No.A1/1538/2024, dt:23.09.2024 from the Executive Officer, Sri Laxmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District.

* * *

In view of the circumstances reported by the Executive Officer, Sri Laxmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District in the reference cited, Smt.V.Srilatha, Superintendent, Sri Raja Rajeshwara Swamy Devasthanam, Vemulawada, Rajanna Sircilla District is hereby deputed to Sri Laxmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District until further orders.

The Executive Officer, Sri Raja Rajeshwara Swamy Devasthanam, Vemulawada, Rajanna Sircilla District is directed to relieve the individual immediately.

On relief, the individual is directed to report before the Executive Officer, Sri Laxmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District.

The Executive Officer, Sri Laxmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District is directed to admit the individual without fail

//True Copy//

Sd/- M.Hanumantha Rao
Director/Commissioner

To
1) The Executive Officer, Sri Laxmi Narasimha Swamy Devasthanam, Yadagirigutta, Yadadri Bhuvanagiri District.
2) The Executive Officer, Sri Raja Rajeshwara Swamy Devasthanam, Vemulawada, Rajanna Sircilla District.
3) Copy to individuals (Through Sl.No.2)
4) Spare

పర్యవేక్షకురాలు శ్రీలతకు యాదగిరిగుట్ట డిప్యూటేషన్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసిన దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయం

వేములవాడ, సెప్టెంబర్ 25: రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో దీర్ఘకాలికంగా ఉద్యోగులు ఒకేచోట పనిచేస్తున్నారని దేవాదాయ శాఖ గత ఆగస్టు 5న బదిలీలు చేపట్టింది. కమిటీలు వేసి, ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించి పకడ్బందీగా బదిలీలు నిర్వహిస్తున్నామని ప్రకటించింది. అయితే దేవాదాయశాఖలో ప్రస్తుతానికి రాజకీయ బదిలీలు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నట్టు తెలుస్తున్నది. రాజన్న ఆలయానికి బదిలీ అయిన యాదగిరిగుట్ట పర్యవేక్షకుడు రాజన్‌బాబు పదిహేను రోజుల్లోపే తమకు తప్పనిసరిగా అవసరమని అక్కడి ఈవో రాష్ట్ర ఉన్నతాధికారులను కోరారు. దీంతో రాజన్‌బాబుకు వర్క్‌ఆర్డర్ పేరుతో విధులు కేటాయించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న పర్యవేక్షకుడు గోలి శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కార్యదర్శిగా విధులు నిర్వహించేందుకు వర్క్ ఆర్డర్ పేరిట ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడకు బదిలీ అయిన పర్యవేక్షకురాలు శ్రీలతను యాదగిరిగుట్టకు డిప్యూటేషన్‌పై కేటాయిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయం ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేసింది. రాజన్న ఆలయంలో మొత్తం 14మంది పర్యవేక్షకులు విధులు నిర్వర్తించాల్సి ఉన్నది. ఇప్పటికే అందులో ఇద్దరు ఉద్యోగ విరమణ పొందగా, ఒకరు యాదగిరిగుట్టకు వర్క్ ఆర్డర్‌పై వెళ్లడంతో పర్యవేక్షకుల సంఖ్య 11కి చేరింది. ఇప్పుడు శ్రీలత కూడా బదిలీ అయితే ఆ సంఖ్య పదికి చేరుకోనున్నది. రాజన్న ఆలయ పర్యవేక్షకుల బదిలీ కార్యాలయ పరిపాలన విభాగానికి అంతుచిక్కని ప్రశ్నగా మారుతుంది. ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.. పర్యవేక్షకుల డిప్యూటేషన్‌పై మౌనం వీడాలని రాజన్న భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే పర్యవేక్షకురాలు శ్రీలత డిప్యూటేషన్‌పై ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని సంప్రదించగా, ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదని వెల్లడించారు.

బాపూజీ జయంతిని విజయవంతం చేయండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 25: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఈ నెల 27న ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో బాపూజీ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో సిరిసిల్లలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహావిష్కరణ చేసుకున్నామని తెలిపారు. జయంతి వేడుకల నిర్వహణ కోసం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరవుతారని తెలిపారు. పద్మశాలీ కులబాంధవులతోపాటు అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, మ్యాన రవి, బొల్లి రామ్మోహన్, తాటిపాముల దామోదర్, గుండ్లపల్లి పూర్ణచందర్, సత్తార్, సంగీతం శ్రీనివాస్, గౌడ రాజు, గుండ్లపల్లి శ్రీనివాస్, కాముని వనిత, ఆడెపు చంద్రకళ, కొండ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయా

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 25: సిరిసిల్లలో అక్టోబర్ 9 నుంచి జరుగనున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఆనంద్ అధ్యక్షతన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ, అక్టోబర్ 9 నుంచి 19వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మున్సిపల్, సెస్, పోలీస్, తదితర సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన శాఖాపరమైన విధులపై పలు ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, ఆలయ అధికారులు, తదితరులున్నారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తాం

- సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్

కార్యాలయంలో ఏఎంసీ చైర్‌పర్సన్ స్వరూప, వైస్ చైర్మన్ నర్సింగంను సన్మానిస్తున్న చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, పాలకవర్గ సభ్యులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 25: రైతులకు మెరుగైన సేవంలదిస్తున్నామని, రైతులకు అందించిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్ అన్నారు. బుధవారం సిరిసిల్ల సింగిల్ విండో కార్యాలయంలో నూతనంగా నియామకమైన సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్ ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పలువురు లబ్ధిదారులు రూ.5 లక్షల షిప్‌లోన్, రూ.8 లక్షల ల్యాండ్ డెవలప్‌మెంట్ స్కీం, డెయిరీ ఫాం కోసం రూ.2 లక్షల చెక్కులను రైతులకు అందించారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, బైరి ప్రభాకర్, గడీల సురేశ్, శ్రీధర్‌రావు, బండి దేవేందర్‌యాదవ్, గన్యానాయక్, సత్తువెంకటరెడ్డి, శనిగరపు లక్ష్మి, పర్శయ్య, సీఈవో బుర్ర నరేశ్, సిబ్బంది ఉన్నారు.

కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

బోయినపల్లి : కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

బోయినపల్లి, సెప్టెంబర్ 25: బోయినపల్లి ఏఎంసీ పాలక వర్గం బుధవారం కొలువు దీరింది. చైర్మన్‌గా బోయినపల్లికి చెందిన బోయిని ఎల్లేశ్ యాదవ్, వైస్ చైర్మన్‌గా దేశాయిపల్లికి చెందిన నిమ్మ వినోద్ రెడ్డి, డైరెక్టర్లుగా అనుముల హరికృష్ణ, మహ్మద్ యూసఫ్, బాలగోని వెంకటేశ్వర్లు, అద్దంకి రమేశ్, గుడి రాజశేఖర్‌రెడ్డి, గంగిపల్లి లచ్చయ్య, నీరటి ప్రదీప్, కల్లేపల్లి సతీశ్, మెరుపుల మహేశ్, రోమాల అజయ్, ఏనుగుల కనకయ్య, జక్కని సందీప్‌తోపాటు బోయినపల్లి సహకార పరపతి సంఘం చైర్మన్ జోగినపల్లి వెంకటరామారావు బోయినపల్లి పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు జయశీల ఉండగా మార్కెట్ కమిటీ కార్యదర్శి రమణ వీరికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్ మాట్లాడుతూ, రైతులకు అందుబాటులో ఉంటూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

ఏఎంసీ సభ్యులకు సన్మానం

వీర్నపల్లి, సెప్టెంబర్ 25: నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా లకావత్ రాములునాయక్, వైస్ చైర్మన్‌గా లెంకల లక్ష్మణ్‌తోపాటు సభ్యులకు సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సెస్ కార్యాలయంలో వారిని శాలువాతో సన్మానించారు. మండలంలోని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ బీజేపీ దిశ కమిటీ సభ్యులు బట్టు వీర్యా, తదితరులున్నారు.

'నాణ్యమైన విద్యనందించేందుకు కృషి'

ముస్తాబాద్ సెప్టెంబర్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, విద్యాబోధన ఉపాధ్యాయుల సహకారంతో మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని మండల విద్యాధికారిగా నియమితులైన నిమ్మ రాజిరెడ్డి పేర్కొన్నారు. గతంలో జిల్లాలో ఐదు మండలాలకు ఒక్కరు ఇన్‌చార్జీ ఎంఈవోగా వ్యవహరించడంతో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉండడంలేదని ప్రభుత్వం మండల నోడల్ అధికారి (ఎంఎన్ఓ)ను పూర్తిస్థాయి విద్యాధికారిగా నియమించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులందరి సహకారంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, ప్రభుత్వ సౌకర్యాలు అందించేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలి

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 25 : విద్యార్థులు క్రమశిక్షణతో కలిగి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి అన్నారు. వేములవాడ పట్టణ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఏఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బ్లాంకెట్లు అందించి మాట్లాడారు. విద్యార్థి దశనుంచే ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని క్రమశిక్షణ, పట్టుదల, ఓపికతో కష్టపడినప్పుడు మంచి విజయాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వీరప్రసాద్, మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మధు మహేశ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కొండూరి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి

వీర్నపల్లి, సెప్టెంబర్ 25: మండలంలోని వన్‌పల్లి, సీతరాంనాయక్ తండా, బంజేరు గ్రామాల్లో వివిధ కారణాలతో దొసపాటి మల్లారెడ్డి, బానోత్ లక్ష్మి, గుగులోత్ సుభాశ్, గుగులోత్ కిషన్ మరణించగా, బాధిత కుటుంబాలను నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, నేతలు బోయిని రవి, రఫీ, సంతోష్, ఉస్మాన్, తదితరులున్నారు.

పోషకాహారంతో ఆరోగ్యకర భవిష్యత్

- జిల్లా సంక్షేమాధికారి పీ లక్ష్మీరాజం

కలెక్టరేట్, సెప్టెంబర్ 25: పిల్లలకు పోషకాహారం అందించడంతోనే భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని జిల్లా సంక్షేమాధికారి పీ లక్ష్మీరాజం పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో పోషణమాసం సందర్భంగా ప్రత్యేక అదనపు అనుబంధ పోషకాహారంపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచనలు, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సలహాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్యారోగ్యశాఖ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి పీ లక్ష్మీరాజం మాట్లాడుతూ, జిల్లాలో ఎన్‌హెచ్‌టీఎస్ ప్రత్యేక యాప్ ద్వారా పిల్లల యొక్క పెరుగుదలను బరువు ఎత్తు కొలతలను పరీక్షించి అంగన్వాడీ టీచర్లు యాప్‌లో నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. వాటి ఆధారంగా అవసరమైన మందులు, పోషణ గురించి కౌన్సెలింగ్ ఇస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి వసంతరావు, ఉపవైద్యాధికారులు రాజగోపాల్, రజిత, జిల్లా ప్రోగ్రాం అధికారి ఉమ, రాష్ట్రీయ బాలస్వస్థ్య యోజన ప్రోగ్రాం ఆఫీసర్ మహిమ, సీడీపీవోలు ఉమారాణి, సౌందర్య, ఏసీడీపీ సుచరిత, జ్యోతి, సూపర్‌వైజర్లు, మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబానికి గ్రామస్తుల చేయూత

నగదును అందజేస్తున్న ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి, సెప్టెంబర్ 25: నిరుపేద కుటుంబానికి గ్రామస్తులు, ఎన్నారైలు చేయూతనందించారు. బుధవారం ఇటీవల వర్షాలతో మల్యాల గ్రామానికి చెందిన బంటు రవి ఇల్లు కూలిపోగా ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేసి ఆదుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీతోపాటు గ్రామానికి చెందిన ఎన్నారైలు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి మాట్లాడుతూ సొంతూరిపై మమకారంతో అభివృద్ధి పనులతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాలతో సహాయం చేస్తున్న గ్రామస్తులు, ఎన్నారైలను అభినందించారు. ఇక్కడ సీఐ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు యువకులున్నారు.

అనారోగ్యంతో ఆటోడ్రైవర్ మృతి

ప్రసాద్ (ఫైల్)

చందుర్తి, సెప్టెంబర్ 25: అనారోగ్యంతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం, మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు వాసం ప్రసాద్ (32) కొన్ని రోజులుగా కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. ఉచిత బస్సు స్కీం వల్ల ఆటో సరిగా నడువక ఆర్థికంగా ఇబ్బందులు